సాక్షి
విశాఖపట్నం
మంగళవారం । 12 । నవంబర్ । 2024



14 నుంచి క్యాన్సర్ పరీక్షలు

క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు ఈనెల 14వ తేదీ నుంచి ప్రారంభించనున్నట్లు కలెక్టర్ హరేందిర ప్రసాద్ తెలిపారు. 8లో



పాహిమాం.. పరమేశ్వరా

కార్తీక మాసం రెండో సోమవారం సందర్భంగా శివాలయాలకు భక్తులు పోటెత్తారు. పూజలు, అభిషేకాలు నిర్వహించారు. 8లో



హీరోయిన్ లావణ్య పూజలు

సీతమ్మధార: హీరో వరుణ్ తేజ్ సతీమణి, హీరోయిన్ లావణ్య త్రిపాఠి సంపత్ వినాయగర్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

న్యూస్‌రీల్

స్టీల్ మెల్ట్‌షాప్-1లో ఉత్పత్తి రికార్డులు



ఉక్కునగరం: విశాఖ స్టీల్‌ప్లాంట్ స్టీల్ మెల్ట్ షాప్-1లో ఉత్పత్తి రికార్డులు కొనసాగుతున్నాయి. స్టీల్ మెల్ట్ షాప్-1లోని ఉద్యోగులు ఈనెల 8న ఒక షిఫ్ట్‌లో రెండు కన్వర్టర్లలో 23 హీట్లు ఉత్పత్తి చేసి రికార్డు **నమోదు చేశారు.** 10వ తేదీన ఒక షిఫ్ట్‌లో **ఒక కన్వర్టర్‌లో** రికార్డు స్థాయిలో 14 హీట్లు ఉ**త్పత్తి చేశారు. అదే రోజు** మూడు షిఫ్ట్‌ల్లో ఒక **కన్వర్టర్‌లో 37 హీట్లు** నమోదు చేసి గత రికా**ర్డులను తిరగ రాశారు.** స్టీల్‌ప్లాంట్ ప్రారంభం **నుంచి ఇవే అత్యుత్తమ** ఉత్పత్తి రికార్డులు కావ**డం గమనార్హం.**

15న పుణ్యనదీ హారతి



సింహాచలం: కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని ఈనెల 15న శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి దేవస్థానానికి చెందిన కొండదిగువ వరాహ పుష్కరిణికి పుణ్యనదీ హారతి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు దేవస్థానం ఈవో వి.త్రినాథరావు తెలిపారు. ఆ రోజు సాయంత్రం 4.30 గంటలకు కొండదిగువ దేవస్థానానికి ఉపాలయమైన శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి స్వామి ఉత్సవమూర్తులను వరాహ పుష్కరిణి వద్దకు తీసుకెళ్తామన్నారు. సాయంత్రం 5 గంటల నుంచి షోడశోపచార పూజలు, నక్షత్ర హారతి, కుంభ హారతీలను స్వామివారికి, వరాహ పుష్కరిణికి అందజేయనున్నట్లు తెలిపారు. ఆ సమయంలో దీపాలను వెలిగించే అవకాశం భక్తులకు కల్పిస్తున్నట్టు చెప్పారు. నూనె, ప్రమిదలు, ఒత్తులు దేవస్థానమే ఉచితంగా అందజేస్తుందన్నారు.

హెల్ప్ లైన్ నెంబర్ల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్, చిత్రంలో పలు శాఖల అధికారులు

మహారాణిపేట: అత్యవసర సమయంలో అందరికీ ఉపయోగపడే విధంగా వివిధ డిపార్టమెంట్లకు చెందిన హెల్ప్ లైన్ల నెంబర్లతో కూడిన పోస్టర్‌ను కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ సోమవారం ఆవిష్కరించారు. వీటి గురించి విస్తృత ప్రచారం కల్పించాలని అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. జేసీ కె.మయూర్ అశోక్, డీఆర్వో భవానీ శంకర్, ఆర్డీవో పి.శ్రీలేఖ, జీవీఎంసీ ఏడీసీ వర్మ, ఐసీడీఎస్ పీడీ జయదేవి, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ పోస్టర్‌ను మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ రూపొందించింది.

చైల్డ్ హెల్ప్ లైన్	1098
ఉమెన్ హెల్ప్ లైన్	181
పోలీస్ హెల్ప్ లైన్	100
జాతీయ అత్యవసర హెల్ప్ లైన్	112
అత్యవసర వైద్య సేవ హెల్ప్ లైన్	108
వైద్య సహాయ హెల్ప్ లైన్	104
సైబర్ నేరాలు హెల్ప్ లైన్	1930
ఫైర్ హెల్ప్ లైన్	101
ఎల్పీజీ గ్యాస్ లీక్ హెల్ప్ లైన్	1906
రోడ్డు ప్రమాదాల హెల్ప్ లైన్	1073

రేపటి నుంచి సీజీఆర్ఎఫ్ సదస్సులు

సాక్షి, విశాఖపట్నం: ఏపీఈపీడీసీఎల్ పరిధిలో పలాస, విశాఖపట్నం జోన్-2, రంపచోడవరం, జంగారెడ్డిగూడెం డివిజన్లలో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 13 నుంచి సదస్సులు నిర్వహించనున్నట్లు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక (సీజీఆర్ఎఫ్) చైర్‌పర్సన్, విశ్రాంతి జడ్జి బి.సత్యనారాయణ తెలిపారు. 13న పలాస డివిజన్‌లోని ఇచ్ఛాపురం సెక్షన్‌లోను, 19న విశాఖపట్నం జోన్-2 లోని మల్కాపురం సబ్ డివిజన్‌లోనూ, 28న రంపచోడవరం డివిజన్‌లోని అడ్డతీగల సెక్షన్‌లోను, 29న జంగారెడ్డిగూడెం డివిజన్ పరిధిలోని కొయ్యలగూడెంలో సదస్సు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు సదస్సుల్లో నేరుగా పాల్గొని విద్యుత్‌సరఫరాలో అంతరాయాలు, హెచ్చుతగ్గులు, బిల్లుల సమస్యలు, కొత్త సర్వీసుల జారీలో జాప్యం మొదలైన సమస్యలపై ఫిర్యాదులు చేయవచ్చని సూచించారు. దీంతోపాటు కనెక్షన్ పేరుమార్పిడి, విద్యుత్ సరఫరా పునరుద్ధరణలో జాప్యం, ట్రాన్స్ ఫార్మర్ మార్పిడి, తదితర సమస్యలపై ఫిర్యాదులను చైర్‌పర్సన్, సీజీఆర్ఎఫ్ కమిటీకి తెలియజేయవచ్చని స్పష్టం చేశారు. సీతమ్మధారలోని ఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో ఉన్న సీజీఆర్ఎఫ్ కార్యాలయానికి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసే అవకాశం కల్పిస్తున్నట్లు వెల్లడించారు.

రూ.1,500 ఎప్పుడయ్యా..



తమ ప్రభుత్వం వస్తే మహిళలకు నెలకు రూ.1500 ఇచ్చి ఆర్థికంగా ఆదుకుంటామని సీఎం చంద్రబాబు ఎన్నికల్లో హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చి ఐదు నెలలవుతున్నా ఇచ్చిన హామీ ఇంతవరకు నెరవేర్చలేదు. ఐదు నెలల డబ్బులు రూ.7,500 నష్టపోయాం. ఇంతకీ ఆ డబ్బులు ఎప్పుడు ఇస్తారో చెప్పండయ్యా. **–రెడ్ల సత్యవతి, ఆరిలోవ కాలనీ,**

మాయమాటలకు మోసపోయాం..



రాష్ట్ర బడ్జెట్‌ను చూస్తుంటే.. ఎన్నికల సమయంలో కూటమి నేతల చెప్పిన మాయమాటలకు మోసపోయామని అర్థమవుతోంది. ఇంట్లో ఉన్న పిల్లలందరికీ తల్లికి వందనం ఇస్తామన్నారు కానీ బడ్జెట్‌లో ఆ మేరకు కేటాయింపులు జరగలేదు. 18 ఏళ్లు నిండిన ప్రతీ మహిళకు రూ.1500 ఇస్తామన్నారు అందుకు బడ్జెట్‌లో తగిన కేటాయింపులు చేయలేదు. ఇంత దారుణంగా ప్రజలను మోసం చేస్తారనుకోలేదు. **–కె.రత్నకుమారి, రామ్‌నగర్**

విశాఖపై చిన్న చూపు..



కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విశాఖ జిల్లాకు తీవ్ర అన్యాయం చేసింది. పోలవరం ఎడమ కాలువ పనుల పూర్తికి ప్రాధాన్యం ఇవ్వలేదు. వ్యవసాయం పట్ల చిన్నచూపునకు ఈ బడ్జెట్ ఒక సంకేతం. స్టీల్‌ప్లాంట్ ప్రస్తావన లేదు. జిల్లాలో మూసివేసిన షుగర్ ఫ్యాక్టరీలను తెరిపిస్తామన్న హామీ లేదు. అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం వంటి హామీలు ఎప్పుడు అమలు చేస్తారో చెప్పలేదు. **–కె.లోకనాథం, జిల్లా కార్యదర్శి, సీపీఎం**

విశాఖను ఆర్థిక రాజధానిగా చేస్తామని చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు ఎన్నికలకు ముందు ఊదరగొట్టారు. కానీ అధికారం చేపట్టాక రాష్ట్ర ఖజానాను నింపుకోవడానికే విశాఖను ఉపయోగించుకున్నారన్న విషయం తేటతెల్లమవుతోంది. విశాఖకు మెట్రో రైలు, ప్రత్యేక రైల్వే జోన్, పర్యాటకాభివృద్ధికి విభిన్నమైన ప్రాజెక్టులు అని గప్పాలు కొట్టిన చంద్రబాబు.. ఇప్పుడు బడ్జెట్ కేటాయింపుల్లో ఉమ్మడి విశాఖ ప్రస్తావనే చేయకపోవడం అందరినీ విస్మయానికి గురిచేస్తోంది. ప్రత్యేక రైల్వే జోన్ పనులను పరుగులు పెట్టిస్తామని ఇటీవలే చంద్రబాబు విశాఖ పర్యటనలో ప్రకటనలు చేశారు. అయితే జోన్ ఏర్పాటుకు అవసరమయ్యే మ్యాచింగ్ గ్రాంట్ నిధులకు మాత్రం బడ్జెట్‌లో కేటాయించలేదు. త్వరలోనే మెట్రో రైలు పనులు ప్రారంభమవుతాయని చెప్పినప్పటికీ.. బడ్జెట్‌లో ఆ **ప్రాజెక్టు ఊసు కూడా లేదు. ఇక పర్యాటకం విషయాన్ని కనీసం పట్టించుకోలేదు.**



విశాఖ ప్రస్తావనే లేదు..

అన్నీ కోతలే..



బడ్జెట్‌లో సూపర్ సిక్స్ హామీలు గాలికి.. ■ మహిళలు, నిరుద్యోగులకు అన్యాయం

రైతుల నోట్లో మట్టి ■ విద్యార్థుల సాయానికి మంగళం ■ బాబు మార్కు మోసం

విశాఖ సిటీ: ఇంటర్ వరకు చదువుతున్న ప్రతి పిల్లాడికి రూ.15 వేలు అంటూ తల్లికి.. ప్రతి నెల రూ.1,500 ఆర్థిక సాయం అంటూ మహిళలకు.. పెట్టుబడి సాయం కింద ఏటా రూ.20 వేలు అంటూ అన్నదాతకు.. ఇలా ఒకటి కాదు.. రెండు కాదు.. అధికార పీఠం కోసం అలవి కాని హామీలిచ్చిన చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాక ఎప్పటిలాగే తూచ్ అన్నారు. అసెంబ్లీలో కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఇందుకు నిదర్శనం. ఇందులో సూపర్ సిక్స్ ఊసేలేదు. రైతుకు భరోసా లేదు. తల్లికి వందనం లేదు. మహిళలకు ఆర్థిక సాయం లేదు. నిరుద్యోగులపై కనీసం దృష్టిపెట్టలేదు. అలాగే నగరంలో మౌలిక సదుపాయాల కల్పనకు, మెట్రో రైలుకు, పర్యాటకాభివృద్ధికి, అనకాపల్లి పారిశ్రామిక పార్కుల ఏర్పాటుకు పైసా కూడా కేటాయించలేదు. ఎన్నికలకు ముందు ప్రతి సభలోను హామీల కూత పెట్టిన చంద్రబాబు.. అధికారంలోకి వచ్చాక మాత్రం గత ప్రభుత్వ పథకాల్లోనే కోతలు పెట్టారు. కొత్త పథకాలకు పైసా కూడా విదల్చని బాబు.. ఉన్న పథకాలకు సైతం మంగళం పాడేలా బడ్జెట్ కేటాయింపులు చేసి మరోసారి తన బుద్ధి చూపించారు.



స్టీల్‌ప్లాంట్‌కు నిధులేవి..?

స్టీల్‌ప్లాంట్ మూల ధనం కోసం రూ.2 వేల కోట్లు సాయం చేయాలని ఉక్కు పరిశ్రమ పరిరక్షణ సంఘం నాయకులు రాష్ట్ర ప్రభుత్వాన్ని వేడుకున్నారు. అయిదు నెలల తరువాత రాష్ట్ర ప్రభుత్వ నిర్మాణాలకు అవసరమయ్యే ఉక్కును ఈ నిధుల ద్వారా కొనుగోలు చేయాలని ప్రతిపాదించారు. కానీ కూటమి ప్రభుత్వ బడ్జెట్‌లో స్టీల్‌ప్లాంట్‌ను కూడా పట్టించుకోలేదు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఈ నిధులను సమకూర్చేందుకు ప్రత్యేక కమిటీని సైతం ఏర్పాటు చేసింది. ఆ కమిటీ ప్రతిపాదనలను సైతం కూటమి ప్రభుత్వం బుట్టదాఖలు చేసింది. తాజాగా స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం పోరాడుతున్న అఖిలపక్ష నాయకులు ఈ విషయాన్ని ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లినా.. కనీసం పైసా కూడా కేటాయించకపోవడం కూటమి ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి ఎంటో అర్థమవుతోంది.



ఉత్తరాంధ్రకు మరోసారి అన్యాయం



రాష్ట్ర బడ్జెట్ తీవ్ర నిరాశ పరిచింది. ఈ ప్రాంత ప్రజలు పెద్ద ఎత్తున పోరాడుతున్నా.. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను రక్షిస్తామనే కనీస ప్రస్తావన కూడా బడ్జెట్ ప్రసంగంలో లేదు. రాష్ట్రంలోనే అతి పెద్ద భారీ పరిశ్రమగా ఉన్న దీనిని కాపాడుకోకుండా.. ఎన్ని పారిశ్రామిక విధానాలు ప్రకటించినా.. రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేస్తామన్నా ప్రజలను మోసగించడం తప్ప మరొకటి కాదు. రాష్ట్ర విభజన చట్టంలోని వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి ప్యాకేజీలు, రైల్వే జోన్, విశాఖ మెట్రోరైల్, గిరిజన వర్సిటీతో సహా విద్యా సంస్థల నిర్మాణంలో కేంద్రం చేస్తున్న జాప్యం గురించి రాష్ట్ర ప్రభుత్వం గమనించినట్లే లేదు. గిరిజన ప్రాంతంలో జీవో నెం 3 పునరుద్ధరణ ప్రస్తావన లేదు. గిరిజన కార్పొరేషన్‌ను బలోపేతం చేయవలసిన అవసరం ఉండగా కనీసం ఆ ఆలోచన కూడా ప్రభుత్వానికి లేదు. **– ఎ.అజశర్మ, ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి**

అంతా అయోమయం



నాకు ముగ్గురు పిల్లలు, చిట్టివలస జెడ్పీ హైస్కూల్‌లో చదువుతున్నారు. కూటమి ప్రభుత్వం తల్లికి వందనం పేరిట రూ.15 వేలు ఇస్తామన్నారు. ఈ లెక్కన మాకు ఏటా రూ.45 వేలు రావాలి. ఇప్పుడు అటువంటి ఆశ కనిపించడం లేదు. బడ్జెట్ అంతా అయోమయంగా ఉంది. **–వెంపాడ ఆదిలక్ష్మి, చిట్టివలస**

మహాశక్తి మహా మాయ



19 నుంచి 59 ఏళ్ల వయసు గల మహిళలకు నెలకు రూ.1500 చొప్పున ఏటా రూ.18 వేలు ఇస్తామని కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీ ఇచ్చింది. కొత్త ప్రభుత్వం ఏర్పాటై అయిదు నెలలు పూర్తవుతోంది. బడ్జెట్‌లో కూడా మహాశక్తి పథకం ఊసే కనిపించడం లేదు. ఇదంతా మహామాయగా ఉంది. **–మద్ది మహాలక్ష్మి, తగరపువలస**

ఇదేం ప్రభుత్వం?



కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాల పేరుతో అన్ని వర్గాలను మోసం చేస్తోంది. మహిళలకు ప్రతి నెలా రూ.1500 ఇచ్చి ఆర్థికంగా ఆదుకుంటామని చెప్పారు. నిధులు కేటాయింపు లేదు. ఉచిత బస్సు ప్రయాణం వచ్చే ఏడాది బడ్జెట్‌లో ఆలోచిస్తారంట. తల్లికి వందనం ఊసే లేదు. ఇదేం ప్రభుత్వం? **– నాగమణి, మహారాణిపేట**

గ్రామాల తరలింపు ప్రస్తావన లేదు



ఏటికొప్పాక, తుమ్మపాల, తాండవ షుగర్ ఫ్యాక్టరీల గురించి ఎలాంటి ప్రస్తావన లేకపోవడం విచారకరం. వీటిని కాపాడుకోకుండా ఎన్ని పారిశ్రామిక విధానాలు ప్రకటించినా ప్రజలను మోసగించడమే తప్ప మరొకటి కాదు. తాడి, మూలస్వయంభూవరం గ్రామాల తరలింపు గురించి ప్రస్తావన లేకపోవడం సరికాదు. **–గనిశెట్టి సత్యనారాయణ, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు**

భవన నిర్మాణ కార్మికుల ఆందోళన బాట

- భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పునరుద్ధరణకు డిమాండ్
- ఏఐటీయూసీ ఛలో కలెక్టరేట్‌ను అడ్డుకున్న పోలీసులు
- పలువురు కార్మిక సంఘ నేతల అరెస్ట్



నిరసనకారులను అరెస్టు చేస్తున్న పోలీసులు




జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న భవన నిర్మాణ కార్మికులు

సీతమ్మధార: రాష్ట్రవ్యాప్తంగా భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి భవన నిర్మాణ కార్మిక సంఘం(ఏఐటీయూసీ) విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ పార్కు వద్ద సోమవారం మహా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడాల రమణ మాట్లాడుతూ రాష్ట్రంలో భవన నిర్మాణ కార్మికుల పరిస్థితి దారుణంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఇసుక ఉచితంగా ఇస్తామని, సంక్షేమ బోర్డును పునరుద్ధరించి భవన నిర్మాణ కార్మికులను ఆదుకుంటామని చెప్పి, అధికారంలోకి వచ్చాక మొండిచేయి చూపించారని ఆక్షేపించారు. అధికారంలోకి వచ్చి నెలలు గడుస్తున్నా కార్మిక సంక్షేమ బోర్డు నిధులు, విధులపై చర్యలు తీసుకోకపోవడం దుర్మార్గమన్నారు. శాసన సభ సమావేశాల్లో భవన నిర్మాణ కార్మిక సంక్షేమ చట్టం- 1996ను అమలు చేస్తూ, ఇతర రాష్ట్రాల్లో మాదిరే ఇక్కడ కూడా కార్మికులకు స్కీం ప్రయోజనాలు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. దళారీలు బ్లాక్‌లో అధిక ధరలకు ఇసుక అమ్ముతున్నారని, ప్రభుత్వం వెంటనే ఇసుక రీచ్‌ల వద్ద నిఘా పటిష్టం చేసి, ఇసుకను అందుబాటులోకి తెచ్చి, కార్మికులకు ఉపాధి కల్పించాలన్నారు.

అనంతరం కలెక్టర్ కార్యాలయానికి రాలీగా వెళ్తున్న యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడాల రమణతోపాటు జిల్లా అధ్యక్షుడు కోటా సత్తిబాబు, నాయకులు ఎం.మదన్ మోహన్, బి.ప్రతాప్, కూన కృష్ణారావు, ఎన్.సూర్యనారాయణ, కె.ఈశ్వరరావు, ఎం.యోగి, దాలి బాబు, రామకృష్ణ, రమణేశ్వరి, ఆర్.సత్తిరాజు, బోర రమణ, ఆర్.కృష్ణ, సూరిబాబు తదితరులును అరెస్ట్ చేసి టూ టౌన్ పోలీస్ స్టేషన్ తరలించారు. ఆందోళనలో ఏఐటీయూసీ నాయకులు కేలం శివ, కోటాన ఆనంద్, ఎన్ మధు, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో శ్రద్ధ అవసరం

- అధికారులకు కలెక్టర్ హరేందిర ప్రసాద్ ఆదేశం
- పీజీఆర్ఎస్‌కు 301 వినతులు



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట: ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు మరింత శ్రద్ధ వహించాలని కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ ఆదేశించారు. పదే పదే వచ్చే ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించాలని, వాటి పరిష్కారంలో ప్రజలతో జిల్లా స్థాయి అధికారులే నేరుగా ఫోన్‌లో మాట్లాడాలని పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో ప్రజల నుంచి కలెక్టర్ వినతులు స్వీకరించారు. ఈ క్రమంలో గత వారం వచ్చిన ఫిర్యాదులు, తీసుకున్న చర్యలపై సమీక్షించిన ఆయన వివిధ అంశాలపై అధికారులకు మార్గదర్శకాలు జారీ చేశారు. పీజీఆర్ఎస్‌కు వచ్చే వినతులకు అధిక ప్రాధాన్యం ఇచ్చి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని, మళ్లీ రీ ఓపెన్ కాకుండా జాగ్రత్త వహించాలన్నారు. సీఎంవో గ్రీవెన్స్ పెండింగ్ లేకుండా చూసుకోవాలన్నారు. అంతర్ శాఖల మధ్య ఉన్న సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు తీసుకోవాలన్నారు. కోర్టు కేసుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, కౌంటర్ దాఖలు చేయాల్సిన అంశాల్లో తక్షణమే స్పందించి, తదుపరి చర్యలు చేపట్టాలని సూచించారు. పీజీఆర్ఎస్‌కు ప్రజల నుంచి 301 వినతులు అందాయి. కలెక్టర్‌తో పాటు జేసీ కె.మయూర్ అశోక్, డీఆర్వో భవానీ శంకర్, ఆర్డీవో పి.శ్రీలేఖ, జీవీఎంసీ ఏడీసీ వర్మ, ఇతర విభాగాల ఉన్నతాధికారులు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.

జీతం కోతలతో 'ఉక్కు'రిబిక్కిరి!

కొండ నాలిక్కి మందు అడిగితే.. ఉన్న నాలుక ఊడేలా చేశాడంట వెనకటికో ప్రబుద్ధుడు. ప్రస్తుతం స్టీల్ ప్లాంట్ విషయంలో కూటమి ప్రభుత్వ వ్యవహార శైలి దీనికి భిన్నంగా ఏమీ లేదు. జీతాలు సరిగా ఇవ్వట్లేదని, దీనిపై చర్యలు తీసుకోవాలంటూ రాష్ట్ర ప్రభుత్వం దగ్గర మొరపెట్టుకుంటే.. తాజాగా మరో 15 శాతం అదనపు కోత విధించారు. మొదటి విడతలో 50 శాతం ఇంకా పెండింగ్‌లో ఉంది. ఇప్పుడు ఏకంగా 65 శాతం పెండింగ్‌లో పెట్టి, జీతంలో కేవలం 35 శాతం మాత్రమే చెల్లించి స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం చేతులు దులిపేసుకుంది. ప్రభుత్వానికి మొరపెట్టుకుంటే మంచి జరుగుతుందని భావించిన ఉద్యోగులు కోతల వెతలు మరింత పెరగడంతో నైరాశ్యంలోకి వెళ్లిపోయారు.



- గత నెల జీతంలో ఇంకా 50 శాతం పెండింగ్
- ఈ నెల కేవలం 35 శాతమే ఖాతాల్లో జమ
- కూటమి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన తర్వాత మరింత కోత
- రోజు రోజుకీ కుంగిపోతున్న ఉద్యోగులు, కార్మికులు
- ఉక్కు ఉద్యమాన్ని నీరుగార్చేందుకేనని సంఘాల ఆరోపణ

సాక్షి, విశాఖపట్నం: స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు యాజమాన్యం మరోసారి షాక్ ఇచ్చింది. సెప్టెంబర్ నెలకు సంబంధించి 50 శాతం జీతం పెండింగ్‌లో ఉండగా అక్టోబర్ నెల జీతం నుంచి తొలివిడతలో కేవలం 35 శాతమే చెల్లించడంతో ఉద్యోగులను గందరగోళంలోకి నెట్టేసింది. ఎన్ని కుయుక్తులు పన్నుతున్నా.. వెరవకుండా.. ఏళ్లతరబడి ఉద్యమాలు చేసి.. స్టీల్‌ప్లాంట్‌ని కాపాడుకునేందుకు శ్రమిస్తున్న ఉద్యోగులు, కార్మికుల ఆర్థిక మూలాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దెబ్బ కొడుతున్నాయి. పోరాటం చేస్తున్న వారి ఆత్మస్థైర్యాన్ని, ఆర్థిక ఆసరాని ఛిద్రం చేస్తే.. ఉద్యమాన్ని నీరుగార్చొచ్చన్న కుతంత్రంతో ప్రభుత్వం వ్యవహరిస్తోంది.

మొరపెట్టుకుంటే.. మరిన్ని ఇబ్బందులు

గతంలో ఏనాడూ జీతాలకు ఇబ్బంది రాలేదని, కూటమి అధికారంలోకి వచ్చిన నాటి నుంచే జీతాల కష్టాలు వచ్చాయని ఉద్యోగులు వాపోతున్నారు. రూ.1650 కోట్లు ప్యాకేజీ ఇచ్చామని చెప్పి జీఎస్టీ, బ్యాంకు రుణాల చెల్లింపు పేరిట వెనక్కి తీసుకోవడం కేంద్ర బీజేపీ, రాష్ట్ర టీడీపీ నేతల స్కెచ్‌లో భాగమని విమర్శిస్తున్నారు. ఉద్యోగులను ఇబ్బందులకు గురి చేసి వీఆర్ఎస్ ద్వారా బయటకు వెళ్లగొట్టేలా చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. సెప్టెంబర్, అక్టోబర్‌కు సంబంధించి నెలా 15 రోజుల జీతాన్ని యాజమాన్యం పెండింగ్‌లో పెట్టడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జీతాల రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామంటూ ఇటీవలే చంద్రబాబు, పవన్ కల్యాణ్‌కు కొందరు ఉద్యోగ, కార్మిక సంఘాల నేతలు విన్నవించుకున్నారు. ఆ తర్వాతే.. గత నెలకు సంబంధించి మిగులు జీతం చెల్లించకపోవడంతో పాటు, ఈ నెల అదనంగా 15 శాతం కోత పెట్టారని వాపోతున్నారు. ప్రభుత్వానికి ఏ సమస్య గురించి చెబుతున్నా.. అది మరింత జఠిలమవుతోందనే భావన ఉద్యోగుల్లో మొదలైంది. ఈ వ్యవహారంలో గుర్తింపు యూనియన్ నాయకుల భాగస్వామ్యం ఉన్నట్లు కొందరు కార్మికులు ఆరోపణలు చేస్తున్నారు. ఉద్యోగుల జీతాల చెల్లింపులో యాజమాన్యం అనుసరిస్తున్న వైఖరిని కూటమి నేతలు పట్టించుకోకపోవడంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది.

కూటమి వచ్చాకే స్టీల్‌ప్లాంట్ కుదేల్

అధికారంలోకి రాకముందు వరకూ విశాఖ స్టీల్ ప్లాంట్‌ని కాపాడుకుంటామంటూ చంద్రబాబు, పవన్‌కల్యాణ్ బీరాలు పలికారు. తీరా కూటమి పేరుతో అధికారంలోకి వచ్చాక.. కార్మికుల ఆకలి కేకల్ని పట్టించుకోవడం మాట దేవుడెరుక.. మరింత కుంగదీసేలా వ్యవహరిస్తున్నారు. నష్టాల పేరిట పది నెలలుగా ఉద్యోగులకు యాజమాన్యం ప్రతి నెలా సగం జీతం చొప్పున నెలలో రెండు విడతలుగా చెల్లిస్తోంది. మొదటి విడత 50 శాతాన్ని 10వ తేదీలోపు, మిగిలిన జీతాన్ని నెలలో చివరి వారంలో ఖాతాల్లో జమ చేసేవారు. సెప్టెంబర్ నెలకు సంబంధించి అక్టోబర్‌లో కేవలం 50 శాతం మాత్రమే చెల్లించారు. మిగిలిన 50 శాతం పెండింగ్‌లో ఉండగానే.. అక్టోబర్ నెల జీతం చెల్లింపుల్లో మరింత కోత విధించారు. కేవలం 35 శాతం మాత్రమే ఉద్యోగుల ఖాతాల్లో యాజమాన్యం జమ చేసింది. దీనిపై నిలదీసేందుకు ఉద్యోగులు ప్రయత్నించినా.. ఉన్నతాధికారులు ఎవరూ స్పందించడం లేదు.

ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి



విశాఖ సిటీ: ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో వచ్చిన ఫిర్యాదులను చట్టపరంగా తక్షణమే పరిష్కరించాలని ఏడీసీపీ(అడ్మిన్) డాక్టర్ వి.బి.రాజ్‌కమల్ పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం పోలీస్ సమావేశ మందిరంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 75 ఫిర్యాదులు వచ్చాయి. ఏడీసీపీ ఫిర్యాదుదారులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. వెంటనే సంబంధిత స్టేషన్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడి వాటిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని చెప్పారు.

జీవీఎంసీ పీజీఆర్ఎస్‌కు 106 వినతులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న మేయర్ హరివెంకటకుమారి, కమిషనర్ సంపత్‌కుమార్

డాబాగార్డెన్స్: జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు 106 వినతులు వచ్చాయని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి తెలిపారు. జీవీఎంసీ పాత సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కమిషనర్ సంపత్‌కుమార్‌తో కలిసి మేయర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొత్తం వినతుల్లో జోన్-1 నుంచి రెండు, జోన్-2 నుంచి 19, జోన్-3 నుంచి 22, జోన్-4 నుంచి ఏడు, జోన్-5 నుంచి 11, జోన్-6 నుంచి తొమ్మిది, జోన్-8 నుంచి తొమ్మిది.. జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి సంబంధించి 31 ఫిర్యాదులు అందాయని తెలిపారు. ఈ ఫిర్యాదులను నిర్ణీత సమయంలో పరిష్కరించాలని జీవీఎంసీ కమిషనర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్లు డి.వి.రమణమూర్తి, ఆర్.సోమన్నారాయణ, ప్రధాన ఇంజనీర్ శివప్రసాదరాజు, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

పాహిమాం.. పరమేశ్వరా

శివాలయాలకు పోటెత్తిన భక్తులు


వన్‌టౌన్ భీమేశ్వర రాజ రాజేశ్వరి దేవాలయంలో ప్రత్యేక పూజలు


ఎంవీపీకాలనీ ముక్తేశ్వర ఆలయంలో కార్తీక మాసం రెండో సోమవారం పురస్కరించుకొని ప్రత్యేక పూజలు


ఆర్.కె.నగర్ రామలింగేశ్వర స్వామి దేవాలయంలో దీపారాధన చేస్తున్న భక్తులు

ఘనంగా రెండో కార్తీక సోమవారం పూజలు

కార్తీక మాసం రెండో సోమవారం సందర్భంగా శివాలయాలకు భక్తులు పోటెత్తారు. తెల్లవారు జాము నుంచే భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మహిళా భక్తులు ఆలయ పరిసరాల్లో కార్తీక దీపాలు వెలిగించి భక్తి చాటుకున్నారు. ఆలయ పరిసరాలు భక్తుల శివనామస్మరణతో మార్మోగిపోయాయి. ఆలయాలకు వెళ్లలేని వారు ఇళ్ల వద్దే దీపాలను వెలిగించి, తమ భక్తిని చాటుకున్నారు.

ఇన్‌'చార్జ్'లో జలవనరుల శాఖ

- ఇరిగేషన్ శాఖలో ఇంజినీర్ల కొరత
- ఉమ్మడి జిల్లా ప్రాజెక్టులపై అంతులేని నిర్లక్ష్యం
- కీలకమైన అన్ని ఇంజినీర్ల పోస్టుల్లో ఇన్‌చార్జిలే దిక్కు
- పదోన్నతుల్లో కూడా జిల్లాకు అన్యాయం

మహారాణిపేట: చంద్రబాబు అధికారంలో ఉంటే వ్యవసాయాన్ని దండగమారి వ్యవహారంలా మార్చేందుకున్న ఏ ఒక్క అవకాశాన్నీ వదులుకోరు. ఒకవేళ అవకాశం లేకున్నా.. ఆ పరిస్థితిని సృష్టిస్తారనడంలో సందేహం లేదు. అందుకు నిదర్శనమే ఉమ్మడి విశాఖ జలవనరుల శాఖలో ఇన్‌చార్జి ఇంజినీర్ల పాలన. ఇంజినీర్ల కొరత తీర్చే దిశగా ప్రభుత్వం కనీస చొరవ చూపట్లేదు. దీంతో ఉమ్మడి విశాఖలో పలు ఇరిగేషన్ ప్రాజెక్టులపై కూటమి ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణి తేటతెల్లమవుతోంది.

ప్రధాన పోస్టులన్నీ ఖాళీ

అల్లూరి, అనకాపల్లి, విశాఖ జిల్లాల్లోని నీటి పారుదల శాఖలో కీలకమైన సూపరింటెండెంట్ ఇంజినీర్(ఎస్ఈ) పోస్టు నుంచి పలు డివిజన్ల ఇంజినీర్ పోస్టులు నెలల తరబడి ఖాళీగా ఉన్నాయి. కీలకమైన ఎస్ఈ పోస్టును కూడా ఇన్‌చార్జితో నెట్టుకొస్తున్నారు. ఉమ్మడి విశాఖలో మూడు డివిజన్లలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు(ఈఈ) లేరు. దీంతో ఉన్న ఒకే ఒక్క ఈఈ నాలుగు డివిజన్ల పర్యవేక్షణ చూడాల్సిన పరిస్థితి. దాదాపు అన్ని ఎస్ఈ, ఈఈ పోస్టుల్లో ఇన్‌చార్జిలే కొలువుదీరడం విశేషం. ఇక అసిస్టెంట్ ఇంజినీర్(ఏఈ), డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్(డీఈఈ) పోస్టుల కొరత కూడా విపరీతంగా ఉంది. ప్రస్తుతం డీఈఈలు, ఏఈల పోస్టులు కూడా ఇన్‌చార్జిల అజమాయిషీలోనే నడుస్తుండటం గమనార్హం.

పదోన్నతులు, పోస్టింగుల్లోనూ అన్యాయం

ఇటీవల ఇచ్చిన పదోన్నతులు, పోస్టింగుల్లో కూడా ఉత్తరాంధ్ర జలవనరుల శాఖకు తీవ్ర అన్యాయం జరిగిందన్న ఆక్షేపణలున్నాయి. ఉమ్మడి విశాఖ, విజయనగరం, శ్రీకాకుళంలో అన్ని ఎస్ఈ, ఈఈ పోస్టులు ఏళ్ల తరబడి ఖాళీగానే ఉంటున్నాయి. మూడు జిల్లాలకు ఒకే ఎస్ఈ మూడు పోస్టుల్లో ఇన్‌చార్జిగా ఉన్నారు. ఇక్కడ ఎంతో మంది సీనియర్ ఈఈలు, డీఈఈలు ఉన్నారు. అయినప్పటికీ ఏవో సాకులు చూపి వారికి పదోన్నతులు ఇవ్వట్లేదు. ఇతర ప్రాంతాల్లో ఉన్నవారిని ఇక్కడ నియమించి, వారికి పెద్ద పీట వేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఉత్తరాంధ్ర కూటమి నేతలు కూడా దీన్ని పట్టించుకున్న పాపానపోవట్లేదని స్థానిక ఇంజినీర్లు వాపోతున్నారు.

షటిల్ సర్వీస్!

జలవనరుల శాఖలో ఇటీవల పోస్టుల భర్తీలో ప్రభుత్వం వింత ఉత్తర్వులు ఇచ్చింది. ఎస్ఈ, చీఫ్ ఇంజినీర్ల(సీఈ) బదిలీల్లో విశాఖ ఎస్ఈ(ఇన్‌చార్జి)గా పనిచేస్తున్న శంబంగి సుగుణాకరరావును విజయవాడ సీఈగా నియమించింది. దీంతోపాటు విశాఖ ఎస్ఈగా కూడా ఆయనే కొనసాగేలా ఉత్తర్వులిచ్చింది. కర్నూలు ఎస్ఈగా పనిచేస్తున్న డి.రామ్‌గోపాల్‌ను విశాఖ కేంద్రంగా ఉన్న నార్త్ కోస్ట్ సీఈగా నియమించారు. కర్నూలులో ఎస్ఈగా, విశాఖలో సీఈగా పనిచేయాల్సిన పరిస్థితి. సుగుణాకరరావు విశాఖ–విజయవాడ మధ్య తిరుగాడాల్సిన దుస్థితి. ఈ ఇద్దరి పోస్టింగులు దూరాభారం, ఎంతో వ్యయ ప్రయాసలతో కూడుకున్నవి. ఈ ఖర్చులన్నీ తడిసి మోపెడవ్వక తప్పని స్థితి.

వరకట్న వేధింపులకు గృహిణి బలి

- సూపర్ వాస్మోల్ 33 తాగి ఆత్మహత్య
- చికిత్స పొందుతూ ఆస్పత్రిలో మృతి
- పోలీసుల అదుపులో భర్త, అత్త

సీతమ్మధార: బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లో మహిళ ఆత్మహత్య మరువక ముందే వరకట్న వేధింపులకు మరో గృహిణి బలైపోయింది. మృతురాలి తల్లిదండ్రులు చెప్పిన వివరాల మేరకు.. శ్రీకాకుళం జిల్లా పాలకొండ మండలం చినమంగళాపురానికి చెందిన కిమిడి సూరిబాబు, కృష్ణకుమారి దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు. చిన్న కుమార్తె దిల్లేశ్వరి(25)కి అక్కయ్యపాలేనికి చెందిన కడగల రాజశేఖర్ అలియాస్ అఖిల్‌రాజ్‌తో 2022 ఫిబ్రవరి 4న వివాహం జరిగింది. అక్కయ్యపాలెం రామచంద్రానగర్‌లోని అత్తింట్లోనే కాపురం ఉంటున్నారు. వివాహ సమయంలో రూ.18 లక్షల కట్నం, 10 తులాల బంగారం ఇచ్చారు. రాజశేఖర్ సొంతంగా ఏఆర్‌కే గ్రూప్ పేరిట వ్యాపారం చేస్తున్నాడు. పెళ్లైన 15 రోజులకే గొడవలు మొదలయ్యాయి. కొన్నాళ్లు పుట్టింటికి వెళ్లి, తిరిగి వచ్చేసింది. ఆరు నెలల గర్భిణిగా ఉన్నప్పుడు అత్త, భర్త అదనపు కట్నం కోసం వేధింపులు ప్రారంభించారు. ఏడో నెలలో పుట్టింటికి తీసుకెళ్లి, డెలివరీ చేయించారు. మగబిడ్డ జన్మించాడు. డిశ్చార్జి సమయంలో అత్తింటివారు వచ్చి, వెంటనే తిరుగుముఖం పట్టారు. బాబుకు


భర్త, అత్త, కుమారుడితో దిల్లేశ్వరి

ఐదు మాసాల సమయంలో ఇంటికి తెచ్చి నాలుగు నెలలపాటు బాగానే చూసుకున్నారు. గత ఏడాది దసరా సమయంలో దిల్లేశ్వరి తండ్రి, మరదలు అనారోగ్యంతో ఆస్పత్రిలో ఉంటే చూడ్డానికి వెళ్లింది. మళ్లీ గొడవలు మొదలయ్యాయి. బారసాల సమయంలో బంగారు గొలుసు పెట్టాలని వేధించారు. అదికూడా పెట్టారు. ఆ తర్వాత వ్యాపార అవసరాల నిమిత్తం రూ.6 లక్షలు డిమాండ్ చేశారు. ఆ మొత్తం కూడా అందించారు. అయినా వేధింపులు ఆగలేదు. ఆమెను నిత్యం వేధిస్తుండటంతో ఎదురింటివారు అత్తను మందలించారు. వారిపైనా ఆమె దురుసుగా ప్రవర్తించి, ఇటీవల ఓ రోజు రాత్రి దిల్లేశ్వరిని భర్త, అత్త కొట్టారు. శనివారం దిల్లేశ్వరి తల్లిదండ్రులకు వీడియో కాల్ చేసి తన గోడు వెల్లబోసుకుంది. మరుసటి రోజు ఆదివారం ఉదయం మళ్లీ ఇంట్లో గొడవ జరిగింది. దీంతో దిల్లేశ్వరి సూపర్ వాస్మోల్ 33(ఆయిల్) తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఇంత జరిగినా పుట్టింటి వారికి సమాచారం ఇవ్వలేదు. పొరుగింటి వారి ద్వారా తెలుసుకున్న దిల్లేశ్వరి తల్లిదండ్రులు తమ కుమార్తె ఇంటికి సమీపంలో ఉన్న తమకు తెలిసిన వ్యక్తికి ఫోన్ చేశారు. అతను దిల్లేశ్వరిని స్థానికంగా ఉన్న ఓ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడి నుంచి ఎస్ఆర్ఐ ఆస్పత్రికి తరలించారు. భర్త రాజశేఖర్‌కు పక్కింటివారు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారు. ఎస్ఆర్ఐ ఆస్పత్రిలో ఐసీయూ ఖర్చు రోజుకు రూ.50 వేలు అవుతుందని చెప్పడంతో భర్త అక్కడి నుంచి డిశ్చార్జి చేయించాడు. తర్వాత కలెక్టరేట్ సమీపంలోని ఓ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి ఆమె మరణించింది. పోస్టుమార్టం నిమిత్తం సోమవారం కేజీహెచ్‌కి తరలించారు. మృతురాలి సోదరుడు కిమిడి సాయిరాం కేంద్రప్రభుత్వ ఉద్యోగి. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు మృతురాలి భర్త, అత్త మీద కేసు నమోదుచేశారు. ఏసీపీ కె.లక్ష్మణమూర్తి పర్యవేక్షణలో 4వ పట్టణ సీఐ ఎస్.విజయకుమార్ కేసును దర్యాప్తు చేస్తున్నారు.


దిల్లేశ్వరి(ఫైల్)

దువ్వాడ మీదుగా ప్రత్యేక రైలు

తాటిచెట్లపాలెం: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా మాల్డా టౌన్–ఎస్ఎంవీ బెంగళూరు–మాల్డా టౌన్ మధ్య స్పెషల్ రైలు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. మాల్డా టౌన్–ఎస్ఎంవీ బెంగళూరు(03403) అన్ రిజర్వ్‌డ్ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 11వ తేదీ సాయంత్రం 5.30 గంటలకు మాల్డా టౌన్‌లో బయల్దేరి మరుసటిరోజు మధ్యరాత్రి(13వ తేదీ తెల్లవారు)1 గంటకు దువ్వాడకు, అదేరోజు రాత్రి 7 గంటలకు ఎస్ఎంవీ బెంగళూరు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో (03404) ఈ నెల 14వ తేదీ ఉదయం 7 గంటలకు ఎస్ఎంవీ బెంగళూరులో బయల్దేరి మరుసటిరోజు తెల్లవారు 2.28 గంటలకు దువ్వాడకు, 16వ ఉదయం 8 గంటలకు మాల్డా టౌన్ చేరుకుంటుంది.

డీఎస్సీ ఉచిత శిక్షణ వాయిదా

ఎంవీపీ కాలనీ: డీఎస్సీ ఉచిత శిక్షణకు ఎంపిక ప్రక్రియను వాయిదా వేసినట్లు జిల్లా సాంఘిక సంక్షేమశాఖ డీడీ రామారావు తెలిపారు. ఈ శిక్షణకు గతంలో ప్రకటించిన మేరకు అక్టోబర్ 27తో దరఖాస్తు గడువు ముగిసింది. భారీగా దరఖాస్తులు రావడంతో అభ్యర్థుల ఎంపిక కోసం ఈ వారంలో స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించాల్సి ఉంది. అయితే పలు జిల్లాల్లో ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ కారణంగా ఎన్నికల కోడ్ అమల్లో ఉండటం, ప్రభుత్వం డీఎస్సీ నోటిఫికేషన్ వాయిదా వేయడంతో ఈ ప్రక్రియకు తాత్కాలికంగా బ్రేక్ పడిందన్నారు.

అన్నా, వదిన వేధింపుల వల్లే ఆత్మహత్య

- వీడిన నర్సింగ్ విద్యార్థిని ఆత్మహత్య మిస్టరీ

విశాఖ విద్య: గోపాలపట్నం మండలం కొత్తపాలెంలో నర్సింగ్ విద్యార్థిని భాగ్యలక్ష్మి(19) ఆత్మహత్య కేసులో మిస్టరీని పోలీసులు చేధించారు. సీఐ కె.సురేష్ తెలిపిన వివరాలు.. తల్లిదండ్రులు లేకపోవటంతో భాగ్యలక్ష్మి పాలకొండ నుంచి కొత్తపాలెం నాగేంద్రకాలనీలోని తన అన్న పి.ఏసుబాబు వద్ద ఉంటూ ఓ ప్రైవేట్ కాలేజీలో నర్సింగ్ చదువుతోంది. అయితే భాగ్యలక్ష్మి ఇక్కడ ఉండటం ఇష్టం లేని ఏసుబాబు భార్య వాగ్దేవి తరచూ సూటిపోటి మాటలతో వేధింపులకు గురిచేస్తుండేది. సొంత అన్నే అయినప్పటికీ, ఏసుబాబు సైతం చులకనగా మాట్లాడుతుండటంతో భరించలేని భాగ్యలక్ష్మి ఈ నెల 7న ఇంట్లో ఆత్మహత్య చేసుకుంది. ఈ విషయాన్ని బయటకు పొక్కనీయకుండా ఏసుబాబు, అతని భార్య వాగ్దేవితో పాటు వరుసకు బావమరుదులైన కేశవరావు, శేఖర్, సురేష్‌తో కలసి కాలనీలోని శ్మశాన వాటికలో పెట్రోల్ పోసి దహనం చేశారు. అనుమానం వచ్చిన స్థానికులు గోపాలపట్నం పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు తమదైన శైలిలో విచారణ జరపగా, అసలు విషయం బయటకు వచ్చింది. మృతురాలి అన్నావదినలతో పాటు, వారికి సహకరించిన కేశవరావు, శేఖర్, సురేష్‌లను సోమవారం అరెస్ట్ చేసిన పోలీసులు, కోర్టులో హాజరు పరిచారు. న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

'భావితరాలకు స్ఫూర్తి అబుల్ కలాం ఆజాద్'

మహారాణిపేట: భావితరాలకు మౌలానా అబుల్ కలాం ఆజాద్ మార్గదర్శకులని జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేందిర ప్రసాద్ అన్నారు. దేశ ప్రథమ విద్యాశాఖ మంత్రి మౌలానా జయంతిని పురస్కరించుకుని కలెక్టరేట్ వీసీ హాల్లో నిర్వహించిన కార్యక్రమంలో మౌలానా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆజాద్ జీవిత విశేషాలను తెలిపారు. దేశ విద్యా రంగానికి ఆయన చేసిన కృషి ఫలితంగానే భారతీయులు విద్యాపరమైన అన్ని రంగాల్లో విశేషంగా రాణిస్తున్నారని కొనియాడారు. హిందూ–ముస్లింల మధ్య సోదర భావాన్ని పెంపొందించటంలో ఆయన కృషి మరువలేనిదన్నారు. నేటి యువత ఆయన బాటలో నడిచి, శ్రద్ధాసక్తులతో కృషి చేసి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.

ముస్లింల సమస్యల పరిష్కారానికి కృషి

ముస్లింల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని జిల్లా కలెక్టర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో భాగంగా ముస్లిం పెద్దలు తమ సమస్యలను కలెక్టర్ వద్ద ప్రస్తావించగా ఆయన సానుకూలంగా స్పందించారు. వక్ఫ్ బోర్డు భూములు, శ్మశాన భూములు అన్యాక్రాంతానికి గురయ్యాయని చెప్పగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి బీహెచ్ భవానీ శంకర్, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారిణి జ్యోతి మాధవి, బర్కత్ అలీ, మహమ్మద్ ఇమ్రాన్, అబ్దుల్ హనీఫ్, రెహ్మాన్, వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.


మౌలానా చిత్రపటానికి పూల మాల వేసి నివాళి అర్పిస్తున్న జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేందిర ప్రసాద్

ఏఎంసీకి డాక్టర్ బాబూరావు పార్థివ దేహం

మహారాణిపేట: సావిత్రి బాయి పూలే ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్(స్పెక్ట్) మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ కె.బాబూరావు పార్థివ దేహాన్ని ఆంధ్రా మెడికల్ కళాశాలకు అప్పగించారు. సోమవారం ఉదయం బాబూరావు కుటుంబ సభ్యులు స్పెక్ట్ ఆధ్వర్యంలో శరీర దాతల సంఘం, అమరావతి విశ్వ సాహితి, మురళీనగర్ వాకర్స్ క్లబ్, పలువురు ఆత్మీయ మిత్రుల ఘన నివాళుల మధ్య ఆయన మృతదేహాన్ని మెడికల్ కాలేజీ అనాటమీ విభాగాధిపతి డాక్టర్ రవీంద్ర కిషోర్‌కు అందించారు. 1961లో ఇదే కాలేజీలో వైద్య విద్యార్థిగా ప్రవేశించి గొప్ప శస్త్ర చికిత్స నిపుణుడిగా, పేదల డాక్టర్‌గా, కవి, రచయితగా డాక్టర్ బాబూరావు పేరొందారు. నేడు అదే అనాటమీ విభాగంలో భావి వైద్యులు శరీర నిర్మాణ శాస్త్రాన్ని అధ్యయనం చేసేందుకు తన శరీరాన్ని దానం చేశారు. కార్యక్రమంలో స్పెక్ట్ చైర్‌పర్సన్ గూడూరు సీతామహాలక్ష్మి, సభ్యులు ఎ.కన్యాకుమారి, డాక్టర్ ఎస్.ఇందిర, డి.స్వర్ణ శైలజ, కె.బాలభాను, ఎ.జ్యోతి, కె.కళావతి, కార్యదర్శి బాబురావు, పి.శ్రీహరిరాజు, వై.నూకరాజు, కె.వి.ప్రసాద్, రాంప్రభు, వెంకట్ రాజు, సభ్యులు పాల్గొన్నారు.


డాక్టర్ బాబూరావు మృతదేహాన్ని ఏఎంసీ అనాటమీ విభాగానికి అందిస్తున్న కుటుంబ సభ్యులు

30లోగా రుణాలకు దరఖాస్తులు

ఎంవీపీకాలనీ: ప్రధానమంత్రి అనుసూచిత్ జాతి అభ్యుదయ పథకం (పీఎంఏజేఏవై)లో భాగంగా సెర్ప్ డీఆర్‌డీఏ ద్వారా ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఎస్సీ మహిళలకు అందించనున్న రుణాలకు గాను దరఖాస్తుకు ఈ నెల 30 చివరి తేదీగా అధికారులు వెల్లడించారు. ఈ రుణాలకు సంబంధించి విధివిధానాలను ఉమ్మడి విశాఖ జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ఎం.సత్యపద్మ వెల్లడించారు. ఈ పథకం ద్వారా డ్వాక్రా మహిళలకు సేవా, సూక్ష్మ, చిన్నతరహా వ్యాపారాలకు రూ. లక్ష నుంచి రూ.3 లక్షల వరకు రుణం అందించనున్నారు. రుణం కోసం దరఖాస్తు చేసుకునే మహిళలు వారి డ్వాక్రా గ్రూపులో తీర్మానం చేసిన కాపీని దరఖాస్తుతో పాటు అందజేయాల్సి ఉంటుంది. దరఖాస్తులను ఈ నెల 30వ తేదీ వరకు ఎంవీపీ కాలనీలోని డీఆర్‌డీఏ పీడీ కార్యాలయంలో నేరుగా అందించాలి.

అమిత బీరాకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు


భారత రత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా సోమవారం విజయవాడలో జరిగిన కార్యక్రమంలో సీఎం చంద్రబాబునాయుడు చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న విశాఖపట్నం ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాల ఇంగ్లిష్ లెక్చరర్ అమిత బీరా. – విజయవాడ

పర్యాటక ప్రాంతాలకు ఆర్టీసీ అద్దె బస్సులు

మద్దిలపాలెం: ఆర్టీసీ తన ఆదాయం పెంచుకునేందుకు వినూత్న మార్గాలను అన్వేషిస్తోంది. కార్తీక మాసంలో పర్యాటక ప్రాంతాలకు వెళ్లే భక్తులను ఆకట్టుకునేందుకు బస్సులను అద్దెకు ఇవ్వడానికి శ్రీకారం చుట్టింది. పుణ్యక్షేత్రాలకు వెళ్లాలనుకునే వారికి అద్దె ప్రాతిపదికన బస్సులు సమకూర్చడానికి మద్దిలపాలెం ఆర్టీసీ డిపో చర్యలు తీసుకుందని ఆ డిపో మేనేజర్ అరుణకుమారి 'సాక్షి'కి తెలిపారు.

– నగరంలో కైలాసగిరి, జూ పార్కు, కంబాలకొండ, తొట్లకొండ, రుషికొండ, వేంకటేశ్వరస్వామి ఆలయం తదితర ప్రాంతాలున్నాయి. ప్రస్తుతం కైలాసగిరి కొండపైకి నాలుగు బస్సులు తిరుగుతున్నాయి. శని, ఆదివారాలు 8 బస్సులు, అవసరాన్ని బట్టి వాటి సంఖ్యను పెంచనున్నారు.

పంచారామాలకు..

కార్తీక మాసంలో అధిక శాతం మంది పంచారామాలకు వెళ్తుంటారు. దీని దృష్ట్యా పంచారామలకు కూడా బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు మద్దిలపాలెం డిపో మేనేజర్ తెలిపారు. ఆదివారం ఉదయం పంచారామాలకు ఒక బస్సు బయలుదేరి వెళ్లిందన్నారు. బస్సులు కావాలనుకునే వారు 99592 25597, 73829 13422 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

గోల్డెన్ పెండా.. ఫస్ట్ లవ్


వికసించిన గోల్డెన్ పెండా పువ్వులు

బీచ్‌రోడ్డు: ఆకర్షణీయమైన, అరుదైన పువ్వుల్లో ఒకటైన గోల్డెన్ పెండా పెదవాల్తేరులోని బయోడైవర్సిటీ పార్క్‌లో తొలిసారిగా వికసించింది. ఈ పార్క్‌లో మొక్క నాటి పదేళ్లవుతోంది. మొదటిసారి పూర్తిగా పువ్వు వికసించిందని పార్క్ పర్యవేక్షకుడు రమణమూర్తి తెలిపారు. ఈ పువ్వును ఇతర దేశాల్లో ఫస్ట్ లవ్(మొదటి ప్రేమ)గా పిలుస్తారని పేర్కొన్నారు.

14 నుంచి సమగ్ర క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

మహారాణిపేట: వైద్య ఆరోగ్యశాఖ రూపొందించిన 'అందరికీ క్యాన్సర్ పరీక్షలు' పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేందిర ప్రసాద్ సోమవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని రకాల క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు ఈనెల 14 నుంచి ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. నాన్ కమ్యూనికేబుల్ డీసీజెస్(ఎన్‌సీడీ-3) ఓరల్, బ్రెస్ట్, సర్వైకల్ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించేందుకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ప్రణాళిక రూపొందించిందన్నారు. 18 ఏళ్లు దాటిన వారందరికీ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. 30 ఏళ్లు దాటిన స్త్రీ, పురుషులకు నోటి క్యాన్సర్ కోసం పరీక్షలు చేయనున్నట్లు కేజీహెచ్ ఆంకాలజీ విభాగాధిపతి డాక్టర్ రంగాకుమారి వెల్లడించారు. మహిళలకు ప్రత్యేకంగా రొమ్ము, గర్భాశయ క్యాన్సర్ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. అసాధారణ కేసులను వైద్యాధికారులు పరీక్షించి, అనుమానితులను మంగళ, శుక్రవారాల్లో ఫాస్ట్ ట్రాక్ ఛానెల్‌తో కేజీహెచ్‌లోని ప్రివెంటివ్ ఆంకాలజీ యూనిట్‌కు రిఫర్ చేస్తామన్నారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖకు చెందిన పలువురు అధికారులు, వైద్యులు పాల్గొన్నారు.

నెట్ బాల్ రాష్ట్రస్థాయి విజేతలు విశాఖ జట్లు


రాష్ట్రస్థాయి నెట్‌బాల్ విజేత విశాఖ బాలికల జట్టు

అగనంపూడి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ ట్రోఫీలను విశాఖ జట్లు కైవసం చేసుకున్నాయి. ఈ నెల 9 నుంచి 11 వరకు మూడు రోజుల పాటు కణితి జెడ్పీ హైస్కూల్ ఆవరణలో జరిగిన ఈ పోటీల్లో విశాఖకు చెందిన అండర్ –14(బాలురు, బాలికలు) జట్లు ప్రథమ స్థానాల్లో నిలిచి ట్రోఫీలను దక్కించుకున్నాయి. బాలుర జట్టు తూర్పు గోదావరి జట్టుపై గెలుపొందగా, బాలికల జట్టు పశ్చిమ గోదావరి జట్టుపై విజేతగా నిలిచింది. కార్యక్రమంలో ఏపీఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ తమ్మిరెడ్డి శివశంకర్, డీవైఈవో సీహెచ్ రవీంద్రబాబు, జనసేన రాష్ట్ర నాయకులు విందుల వెంకటరమణ, పీలా రామకృష్ణ, వార్డు కార్పొరేటర్ బొండా జగన్, పాఠశాల హెచ్ఎం సూర్యప్రకాశరావు, పాఠశాల ఫిజికల్ డైరెక్టర్లు ఎం.మన్నాజీ, నారాయణరావు, వెంకటరావు, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి వి.దేముడు, ఎంఈవో సునీత పాల్గొన్నారు.


నెట్‌బాల్ రాష్ట్రస్థాయి ట్రోఫీని దక్కించుకున్న విశాఖ బాలుర జట్టు

భవనం పైనుంచి పడి కార్మికుడి మృతి

- మృతుడిది శ్రీకాకుళం జిల్లా కె.మత్స్యలేశం

మధురవాడ: భవన నిర్మాణ పని చేస్తుండగా జారి పడి మైలపల్లి రాముడు(34) అనే కార్మికుడు మృతి చెందాడు. దీనికి సంబంధించి పీఎం పాలెం పోలీసులు తెలిపిన వివరాలు.. శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలం కొవ్వాడ మత్స్యలేశానికి చెందిన రాముడు భార్య కొర్లమ్మ, ఇతర కార్మికులతో బక్కన్నపాలెంలో ఉంటూ భవన నిర్మాణ పనులు చేస్తూ, జీవనం సాగిస్తున్నాడు. మధురవాడ సమీపంలోని బక్కన్నపాలెం ఉత్కర్ష క్యాపిటల్‌లో సహ కార్మికులతో కలసి ఆదివారం ఉదయం 6 గంటలకే పని ప్రారంభించారు. మధ్యాహ్నం 2.40 సమయంలో డి బ్లాక్ 8వ ఫ్లోర్ పైకి వాటర్ పైప్ లాగుతున్నాడు. ఆ క్రమంలో పైపు తెగిపోవడంతో తూలి, మూడవ ఫ్లోర్‌లో ఉన్న ఇనుప రాడ్లపై పడి అక్కడ నుంచి సెల్లార్‌లో ఉన్న నీటితో నిండిన లిఫ్ట్ పిట్‌లో పడ్డాడు. తల, చేతులు, కాళ్లు, ఇతర భాగాలపై తీవ్ర గాయాలయ్యాయి. దీంతో వైద్యం నిమిత్తం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు డ్యూటీ డాక్టర్ నిర్ధారించారు. భార్య కొర్లమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పీఎం పాలెం పోలీసులు కేసు నమోదు చేశారు.

ఐఎస్‌వో అధ్యక్షుడిగా శ్రీరామ్మూర్తి

మహారాణిపేట: ఇండియన్ సొసైటీ ఓటాలజీ(ఐఎస్‌వో) సంఘం అధ్యక్షుడిగా విశాఖకు చెందిన డాక్టర్ బి.శ్రీరామ్మూర్తి పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈనెల 8 నుంచి 10వ తేదీ వరకు ఆగ్రాలో జరిగిన వార్షిక సమావేశంలో కేంద్ర మంత్రి రాంసింగ్, ఇండియన్ సొసైటీ ఆఫ్ ఓటాలజీ వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రొఫెసర్ కె.కె.రామలింగం సమక్షంలో చెన్నైకి చెందిన ప్రొఫెసర్ రవి రామలింగం నుంచి బాధ్యతలు స్వీకరించారు. సమావేశంలో ఇటలీ నుంచి చెవి నిపుణుడు ప్రొఫెసర్ డానియల్ మార్చియోని, యునైటెడ్ స్టేట్స్ నుంచి డాక్టర్ రిక్ ఫ్రైడ్మన్, దుబాయ్ నుంచి ఇతర వైద్యులు పాల్గొన్నారు.